క్లుప్తంగా

ముగిసిన ఉచిత వైద్యశిబిరం



గుంటూరు వెస్ట్: ఏపీ స్టేట్ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసిందని అధ్యక్షుడు చింతల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కళ్లు, దంతాలు, బీపీ, షుగర్‌తో పాటు అనేక రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేయించామని చెప్పారు. డాక్టర్ శ్రావణి లక్ష్మి కోట, డాక్టర్ జి.విజయచంద్రతోపాటు కోనాక్ డయాగ్నస్టిక్స్ కె.రామాంజనేయులు, సిబ్బంది తమకు సహాయ సహకారాలందించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కె.లూర్ధురాజు, పి.నాగరాజు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ


నెహ్రూనగర్: మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ కోసం గుంటూరుజిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి ఎ.భవానీ గురువారం తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు, పదో తరగతి, టీటీసీ, బీఈడీ మార్కులిస్టులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రాజాగారి తోటలో బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు చెందినవారు సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 నంబరులో సంప్రదించాలన్నారు.

గేట్‌లో భాష్యం పూర్వ విద్యార్థికి 25వ ర్యాంక్


ఘంటా హేమంత్

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్-2025) ఫలితాల్లో భాష్యం పూర్వ విద్యార్థి ఘంటా హేమంత్ జాతీయస్థాయిలో 25వ ర్యాంకును సొంతం చేసుకున్నట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో ఐఐటీ రూర్కీ నిర్వహించిన గేట్ పరీక్షలో లక్షలాదిమంది ఇంజినీరింగ్ విద్యార్థులు పోటీ పడగా డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీఏ) విభాగంలో భాష్యం పూర్వ విద్యార్థి జాతీయస్థాయిలో ఆలిండియా 25వ ర్యాంకు సాధించటం ఎంతో గర్వకారణమన్నారు. ఘంటా హేమంత్ పాఠశాల స్థాయి నుంచి భాష్యం విద్యా సంస్థల్లో చదువుకుని, భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ద్వారా 2021లో ఐఐటీ మద్రాస్ లో సీటు సాధించిన విషయం గుర్తు చేశారు. భవిష్యత్తులో మరెన్నో ఘన విజయాలను హేమంత్ సాధించాలని రామకృష్ణ ఆకాంక్షించారు. ఈ విజయాన్ని సాధించిన హేమంత్‌ను, వారి తల్లిదండ్రులను చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



చేబ్రోలు: తడి, పొడి హానికర చెత్తలను ప్రజలు వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందించే విధంగా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి, అలవాటుగా మార్చాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.పద్మరాణి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ఎస్‌డబ్ల్యూ షెడ్‌లో చేబ్రోలు, వట్టిచెరుకూరు, పొన్నూరు మండలాలకు చెందిన సిబ్బందికి 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఘన వ్యర్థాల నిర్వహణపై బ్యాచ్‌ల వారీగా శిక్షణ కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ పద్మరాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీ ప్రథమ కర్తవ్యమన్నారు. కంపెనీలు, దుకాణాలు, ఇళ్ల నుంచి పంచాయతీ సిబ్బంది సేకరించే ఘన వ్యర్థాలతో సంపద తయారు చేసేందుకు చెత్త నుంచి సంపద కేంద్రాలును ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో చెత్త సేకరణలో పాటించవలసిన విధానంపై అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ విధానం గురించి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.లలిత, గ్రామ సర్పంచ్ ఎ. వినితారాణి, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, తెనాలి డివిజన్ కో-ఆర్డినేటర్ ఎ.రవి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

దళిత కాలనీలపై చిన్నచూపు!

- ఆయా డివిజన్లకు తాగునీరు తగ్గించేందుకు కుట్ర
- నెహ్రూనగర్ మెయిన్ పంపింగ్ లైన్ నుంచి రెడ్డిపాలెంలోని అపార్ట్‌మెంట్స్‌కు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు
- దీని వల్ల నగరంలోని శివారు 6 డివిజన్‌లలో తాగునీరు తగ్గే ప్రమాదం
- పైపులైన్ ఇంటర్ కనెక్షన్ ఇచ్చేందుకు వచ్చిన సిబ్బందిని అడ్డుకున్న కార్పొరేటర్ మల్లవరపు రమ్య, స్థానికులు


రాజీవ్ గాంధీనగర్ వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులను అడ్డుకున్న కార్పొరేటర్ మల్లవరపు రమ్య, స్థానికులు

నెహ్రూనగర్: దళిత కాలనీలకు తాగునీటిని తగ్గించి ఆ నీటిని అపార్ట్‌మెంట్ వాసులకు మళ్లించేందుకు ఇంజినీరింగ్ అధికారులు కుట్ర పన్నుతున్నారు. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల ప్రతిరోజూ నుంచి 50 నుంచి 55 వార్డులకు తాగునీరు ప్రతి రోజు సరఫరా అవుతుంది. దీంతో పాటు గోరంట్లకు కూడా సరఫరా అవుతుంది. అయితే వేసవి కావడంతో ఈమధ్య నీటి లభ్యత తక్కువగా ఉంది. ఈ క్రమంలో నగర శివారు ప్రాంతమైన రెడ్డిపాలెంలోని అపార్ట్‌మెంట్స్‌కు నీటిని మళ్లించేందుకు అధికారులు పూనుకోవడం వివాదాస్పదమైంది. రాజీవ్ గాంధీనగర్ వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధమైన ఇంజినీరింగ్ సిబ్బందిని 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య అడ్డుకుని పనులను ఆపించారు.

ఇంటర్ కనెక్షన్ ఇస్తే తీవ్ర నీటికష్టాలు...

నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి రాజీవ్‌గాంధీనగర్, శారదాకాలనీ, వసంతరాయపురం, హనుమయ్యనగర్, గోరంట్ల వాటర్ ట్యాంకులకు ప్రతి రోజు ప్రధాన పంపింగ్ లైన్‌పై తాగునీటి సరఫరా జరుగుతుంది. ఇప్పటి వరకు అంతా బాగానే ఉంది. ఈ క్రమంలో రెడ్డిపాలెంలో ఉండే అపార్ట్‌మెంట్ వాసులకు ఈ నీటిని మళ్లించేందుకు ఇంజినీరింగ్ అధికారులు ఇంటర్ కనెక్షన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం రాజీవ్‌గాంధీనగర్ వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్న సిబ్బందిని స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య అడ్డుకుని పనులను ఆపించారు. ఇక్కడ నుంచి నీటిని రెడ్డిపాలెంకు పంపింగ్ చేస్తే మా ప్రాంతంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. దీని వలన 50, 51, 52, 53, 54, 55 వార్డుల్లోని సుమారు లక్ష మందికిపైగా ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని అధికారులకు తెలిపారు. అధికారులు తమ ప్రాంతానికి తాగునీటిని తగ్గించే ప్రయత్నాలు మానుకోవాలని స్థానికులు సైతం కోరారు.

• ప్రత్యామ్నాయ మార్గాల్లో అందించండి

మా ప్రాంతంలో దళితులు ఎక్కువగా నివాసం ఉంటారు. రాజీవ్‌గాంధీనగర్ నుంచి రెడ్డిపాలెంకు ఇంటర్ కనెక్షన్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తే మా ప్రాంతంలో ఉండే దళితులకు తాగునీరు తగ్గిపోయే ప్రమాదం ఉంది. గతంలో కూడా ఇదే విధంగా పనులు చేపడితే అడ్డుకున్నాం. మళ్లీ ఇప్పుడు ఇంజినీరింగ్ అధికారులు కావాలనే దళిత వార్డుల నుంచి తాగునీటిని మళ్లించేందుకు కుట్ర పన్నుతున్నారు. వేసవి ప్రారంభంలో అసలే నీటి సరఫరా అంతంతమాత్రంగా ఉంది. రెడ్డిపాలెంకు నీరు ఇవ్వడానికి మాకేమి అభ్యంతరం లేదు. మా ప్రాంతం నుంచి వెళ్లే పంపింగ్ లైన్ నుంచి కాకుండా ప్రత్యామ్నాయంగా వేరో చోట నుంచి పైపులైన్ వేసుకుని తాగునీటిని అందించుకోవాలి. అంతేకానీ కావాలని ఇక్కడే ఇంటర్ కనెక్షన్ ఇసామనడం సరికాదు.

– మల్లవరపు రమ్య,
54వ డివిజన్ కార్పొరేటర్

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

జిల్లా కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నేతల వినతిపత్రం


జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

లక్ష్మీపురం: ఫిబ్రవరి 18న చేబ్రోలు మండలం సుద్దపల్లి బుడంపాడు గ్రామాల మధ్యలో ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ కార్మికులైన ముగ్గురు మహిళల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఘటనలో మృతులైన తోట సీతారామ, అల్లం శెట్టి అరుణ, కుర్ర నాంచారమ్మల కుటుంబాలను పరామర్శించామన్నారు. ప్రమాదంలో మరణించిన ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, గాయపడిన వారికి రూ.2 లక్షలు మంజూరు చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. సంఘ నాయకులు, మృతుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో మెష్‌లు ఏర్పాటు చేయాలి


అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అంతర్గత డ్రెయిన్‌ల నుంచి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు మేజర్ డ్రైన్లలోకి రాకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ సంగడిగుంట, ఎల్‌ఆర్ కాలనీ, ఆనందపేట, అరండల్ పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెష్‌ల దగ్గర నిలిచిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌లను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. రోడ్లు, డ్రైన్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. తొలుత 9వ డివిజన్ మస్టర్ పాయింట్‌ని పరిశీలించి, కార్మికుల, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. పర్యటనలో ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్వ్ ఆపరేటర్లు విధుల నుంచి తొలగింపు..

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవరించిన వసంతరాయపురం రిజర్వాయర్‌లోని ఇద్దరు అవుట్ సోర్సింగ్ వాల్వ్ ఆపరేటర్లను విధుల నుంచి ఆప్కాస్ నుంచి తొలగించామని కమిషనర్ గురువారం తెలిపారు. వసంతరాయపురం రిజర్వాయర్‌లో శ్యామ్ ప్రసాద్, నారాయణలు తమకు కేటాయించిన తాగునీటి సరఫరా వాల్వ్ ఆపరేటింగ్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానికులు పలుమార్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఈ అంశంపై డీఈఈతో ప్రాథమిక విచారణ చేయించి, వారిని తొలగించడం జరిగిందన్నారు.

• టెర్రస్ కిచెన్ గార్డెన్స్ నిర్వాహకులు, ప్రకృతి ప్రేమికులతో ఈ నెల 22న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ఔత్సాహికులు హాజరై తగిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం అమలు చేయనున్నామని, అందులో భాగంగా వివిధ వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులకు అవగాహన సదస్సును ఈ నెల 25న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశామన్నారు.

నగరాభివృద్ధిపై డ్రోన్‌తో పర్యవేక్షణ

గుంటూరు నగరాభివృద్ధి పర్యవేక్షణకు డ్రోన్ విధానాన్ని శుక్రవారం నుంచి అమలు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలో డ్రోన్‌లను స్వయంగా ఆపరేట్ చేసి పలు ప్రాతాలలోని పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు.

జీజీహెచ్ ఓపీ విభాగానికి ఏసీలు వితరణ


ఏసీలు అమర్చిన గదిని ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వైద్య సేవలు బాగున్నాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.విజయకుమార్ అన్నారు. ఇటీవల కాలంలో జనరల్ సర్జరీ విభాగంలో ఆయన వైద్యం చేయించుకున్నారు. వైద్య సేవలు సంతృప్తికరంగా ఉండటంతో జనరల్ సర్జరీ ఓపీ విభాగంలో 19వ నంబరు గదిలో గురువారం ఆయన సతీమణి టి.పుష్పవిజయ కుమార్‌తో కలిసి రెండు ఏసీలు బహూకరించి ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకంతో ఎంతోమంది పేదలు ఆసుపత్రికి వస్తున్నారని, ఆసుపత్రిలో సంతృప్తికరమైన వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మతపెద్దలకు దుస్తులు పంపిణీ


మత పెద్దలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో ప్రతి రోజు ఐదు పూటల నమాజ్ చేయించే మౌజన్‌లు, నమాజ్ చదివించే ఇమామ్‌లకు ప్రతి ఏటా పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేత షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక బారాఇమామ్ బజార్‌లోని తన నివాసంలో గురువారం నగరంలో ఉన్న ముస్లిం మత పెద్దలకు నూతన దుస్తులను మస్తాన్‌వలీ పంపిణీ చేశారు. అనంతరం ముఫ్తీలు జావేద్, మున్వర్, అజీజ్, ఉస్మాన్, ఉస్మాన్, ఇక్బాల్, మౌలానాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో అంతర్జాతీయ సంతోష దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ రమణమూర్తి, వేదికపై ఆచార్య చెన్నారెడ్డి, తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో అంతర్జాతీయ సంతోష దినోత్సవం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూవర్సిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు. ఆయన అంతర్జాతీయ సంతోష దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సంతోషంగా ఉండటం వల్ల కలిగే శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమతుల్యానికి, సామాజిక ఆనందానికి, ప్రశాంతతకు, అభివృద్ధికి సంతోషం ఏవిధంగా దోహదం చేస్తుందో వివరించారు. సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజలు నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవనం, ఏవిధంగా సంతోషానికి దోహదం చేస్తుందో వివరించారు. ఆచార్య టి.డి.విమల మాట్లాడుతూ అంతర్జాతీయ సంతోషదినం ఆవిర్భావానికి కారణాలు వివరించారు. ఆనందమైన ఉద్వేగాలతో నిండిన జీవితం, అర్థవంతమైన జీవితం, మన శక్తి సామర్థ్యాలు సంపూర్ణంగా ఉపయోగించుకుంటే సంతోషమనేది వస్తుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. సైకాలజీ విభాగ అధ్యాపకులు అనుమ, ప్రమీలరాణి, కె.కృష్ణమోహన్, కె.శాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన భగవద్గీత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీ భగవద్గీత త్రయోదశ అధ్యాయంలోని క్షేత్రజ్ఞ విభాగయోగం ప్రవచనం గురువారం ముగిసింది. జరుబుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో కార్యక్రమం జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచిస్తూ సకల కర్మలు అన్నివిధాలుగా ప్రకృతి ద్వారా జరుగుతున్నాయన్నారు. ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తును ప్రకాశించునట్లు, ఒకే ఆత్మ సర్వప్రాణులయందు స్థితమై, చైతన్యవంతంగా చేస్తుందని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురు గురువారం వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో బాటసారులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశామని అశోక్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఇ.వరప్రసాద్, టీడీపీ నాయకులు కొనకళ్ళ సత్యం, దాతలు మొగిలి సతీష్‌కుమార్, దేవరశెట్టి అప్పారావు, చలివేంద్రం కమిటీ చైర్మన్ గుండా మణిశంకరరావు పాల్గొన్నారు.

కిందపడిన బ్యాగ్‌తో ఆటోడ్రైవర్ ఉడాయింపు

లక్ష్మీపురం: ఒక ఎలక్ట్రానిక్ పరికరాల దుకాణానికి వచ్చిన దంపతులు కారుదిగి లోపలికి వెళ్లే సమయంలో వారి వద్ద ఉన్న బ్యాగ్ కింద పడిపోవడంతో దాన్ని గమనించిన ఓ ఆటో డ్రైవర్ దాన్ని తీసుకుని ఉడాయించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక లక్ష్మీపురంలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద బుధవారం సాయంత్రం పల్నాడు జిల్లా, చిలకలూరి పేట మండలం, లింగంగుంట్ల గ్రామానికి చెందిన అఖిల అనే మహిళ కారులో వచ్చారు. కారులో వచ్చిన షోరూంలోకి వెళ్లే సమయంలో వారి వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్ కింద పడిపోయింది. దానిని చూసుకోకుండా లోపలికి వెళ్లి ఫ్రిజ్ కొనుగోలు చేసి, నగదు చెల్లిద్దామని చూసేసరికి బ్యాగ్ కనిపించలేదు. చుట్టు పక్కల పరిశీలించి, అనంతరం బజాజ్ షోరూం బయట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా కారులో నుంచి కింద దిగిన సమయంలో కింద పడిన బ్యాగ్‌ను ఓ గుర్తు తెలియని ఆటో డ్రైవర్ తీసుకుని వెళ్లినట్లు గుర్తించారు. దీనిపై బాధితులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. బ్యాగులో 50 గ్రాముల బంగారం ఉందని బాధితురాలు తెలిపారు.

డాక్టర్ అనిల్ కుమార్ ఎన్నికపై హర్షం


డాక్టర్ అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న రాజారావు, తదితరులు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అధికారుల సంఘం ముఖ్య సలహాదారుడిగా వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఎన్నికవడం అభినందనీయమని గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు కొనియాడారు. వైద్య ఆరోగ్యశాఖలో సీనియర్ డాక్టర్ అనిల్ కుమార్ సేవాభావంతో విధులు నిర్వహిస్తూ, మంచి అధికారిగా గుర్తింపు పొందిన అడిషనల్ డైరెక్టర్ స్థాయికి చేరుకున్నట్లు వెల్లడించారు. డాక్టర్ అనిల్ కుమార్ సేవలు గెజిటెడ్ అధికారుల సంఘానికి, సంఘ పటిష్టతకు ఎంతో ఉపయోగకరమన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ జేడీ డాక్టర్ రత్నావళి, ఏపీజేఏసీ నాయకురాలు టి.మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

23న డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో గుండె వైద్యశిబిరం

గుంటూరు మెడికల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న గుంటూరులోని జె.కె.సి.కళాశాల ప్రాంగణంలో గుండె జబ్బుల ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత చైర్మన్ పావులూరి రమేష్, వైద్య విభాగం చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు శ్రీ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, సీనియర్ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి, ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వై.రామకిషోర్ పాల్గొంటారన్నారు. ఉచితంగా షుగర్, బీపీ, ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించి వైద్యుల సలహా మేరకు మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉచిత వైద్య జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి

లాం ఫాంలో ముగిసిన విలేజ్‌లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్


కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నందు గత 15 రోజులుగా జరుగుతున్న విలేజ్ లెవల్ ఎంటర్ ప్రెన్యూర్ సర్టిఫికెట్ కోర్స్ గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, ఎఫ్‌పీవోలకు వ్యవసాయ సంబంధిత సమాచారం, విత్తనం, విత్తనోత్పత్తి, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఇన్‌పుట్స్, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించారు. శాస్త్రవేత్తలతో వివిధ పంటల సాగు వివరాలు, ఎరువుల యాజమానయం, పురుగు మందుల వినియోగం, తెగుళ్ళ యాజమాన్యం, నేల ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయం, జీవనియంత్రణ, జీవన ఎరువులు, జీవరసాయనాలు, డ్రోన్ల వినియోగం వంటి అంశాలపై శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పొందిన రైతులు వారి పరిజ్ఞానాన్ని ఇతర రైతులకు అందించి, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమం సీఎస్‌సీ కో-ఆర్డినేటర్ సయ్యద్ సైదావలి మాట్లాడుతూ రైతు స్థాయిలో వివిధ పంటల్లో ఎరువులు, పురుగు మందులు వినియోగం ఎక్కువగా ఉందని దాని ప్రభావం వల్ల సాగు ఖర్చు పెరగటంతోపాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. అవసరం మేరకు మాత్రమే రసాయన ఎరువులను, పురుగు మందులను వినియోగించాలని సూచించారు. సీఎస్‌సీ స్టేట్ హెడ్ రవికుమార్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రజలకు సీఎస్‌సీ విభాగం సేవలు అందిస్తుందన్నారు. ఇన్‌పుట్ డీలర్స్ వ్యాపార దృక్పధంతోనే కాకుండా సేవా దృక్పథంతో రైతుల సాగు ఖర్చులు తగ్గించే విధంగా ఆలోచన చేయాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల సేవలు విస్తరణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఏరువాక కేంద్రాలు, కేవీకేల ద్వారా ఎఫ్‌పీవోలకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్స్ కో-ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన ఉండాలి

ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ కెనడీ

కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి విద్యలో ప్రథమ స్థానంలో నిలిచేవిధంగా ఉపాధ్యాయులు బోధనసాగించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించి ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా విద్యలో వెనుకపడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఒకటి నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

డాక్టర్ కత్తి పద్మారావు



పొన్నూరు: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెండో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ రచయిత డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో గురువారం అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు డాక్టర్ కత్తి పద్మారావును మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12వ తేదీన నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పద్మారావును కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం అంబేడ్కర్ జీవిత విశేషాల పుస్తకాలను ఆవిష్కరించారు. పొందుగల అనిల్ బాబు, పోతన ప్రతాప్, రుద్రపాటి రాజశేఖర్, గురిందపల్లి కాంతి కిరణ్, అమృతలూరి క్రాంతి, కె.అమృత రావు, మాధవ్, అక్కిదాసు జాషువా పాల్గొన్నారు.